క్లుప్తంగా

టెన్త్‌లో శతశాతం ఉత్తీర్ణతకు కృషి



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎంఈఓ సామల

బలిజిపేట: ప్రస్తుత విద్యా సంవత్సరంలో పదో తరగతి విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు ప్రణాళికలు రచించి కృషి చేయాలని ఎంఈఓ 1 ఎస్.సింహాచలం అన్నారు. బలిజిపేట ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో ఆయన శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పది విద్యార్థులు మంచి మార్కులు సాధించేందుకు అవసరమైన చిట్కాలు ఉపయోగించి వారి ప్రగతికి కృషి చేయాలన్నారు. సమావేశంలో ఎంఈఓ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టేకు కలప స్వాధీనం



టేకు కలపను స్వాధీనం చేసుకున్న అటవీశాఖ అధికారులు

కురుపాం: అనుమతులు లేకుండా మ్యాక్సీ పికప్‌లో తరలిస్తున్న టేకు కలపను స్వాధీనం చేసుకున్నట్లు ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ బి.సింహాద్రి శుక్రవారం తెలిపారు. గుమ్మలక్ష్మీపురం నుండి పాలకొండ తరలిస్తుండగా పాలకొండ పరిసర ప్రాంతాల్లో కలపతో పాటు వ్యాన్‌ను పట్టుకొని కురుపాం ఫారెస్ట్ కార్యాలయానికి తరలించినట్టు చెప్పారు. అయితే అది రైతు వద్ద కలపే అయినప్పటికీ అటవీశాఖ అధికారుల అనుమతి పత్రాలు తప్పనిసరిగా ఉండాలని అనుమతి పత్రాలు లేనందున పట్టుకొని అపరాధ రుసుం వేశామన్నారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

సీతంపేట: మండల కేంద్రంలో ముమ్మరంగా పారిశుధ్య పనులు చేపడుతున్నారు. సర్పంచ్ ఆరిక కళావతి పర్యవేక్షణలో సామాజిక భవనం పక్క వీధిలో శుక్రవారం కాలువలను శుభ్రం చేశారు. దోమల నివారణలో భాగంగా అందరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సర్పంచ్ కళావతి కోరారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



పుస్తకాలు పంపిణీ చేస్తున్న ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు

కొమరాడ: మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ప్రిన్సిపాల్ వై.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పుస్తకాలు, బ్యాగులను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకొని పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

చినకుదమలో గజరాజుల సంచారం



చినకుదమ పంట పొలాల్లో ఏనుగులు

జియ్యమ్మవలస: మండలంలోని గౌరీపురం, చినకుదమ, పెదకుదమ పంట పొలాల్లో గజరాజులు శుక్రవారం సంచరించాయి. అరటి పంటను ధ్వంసం చేస్తుండడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. గజరాజులు గుంపు కుదమ పంచాయతీ పరిధిలో సంచరిస్తుండడంతో ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు.

సూచనలు పాటించాలి..



రైతులకు పొలంలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

పాలకొండ రూరల్ : వ్యవసాయాధికారుల సూచనలను రైతులు తప్పకుండా పాటించాలని వ్యవసాయశాఖ పార్వతీపురం మన్యం జిల్లా డీఆర్‌సీలు శారద, భారతి, స్థానిక ఎ.డి కె. రత్నకుమారి అన్నారు. మండలంలోని జంపరకోటలో ఎరువుల యాజమాన్యంపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎరువుల వినియోగం, సీడ్ ఫౌండేషన్, కాలిబాటల ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో ఏఓ ఎన్ని వాహిని, వ్యవసాయ సహాయకురాలు భవానీ పాల్గొన్నారు.

ముమ్మరంగా సాగు



మర్రివానివలస వద్ద ట్రాక్టర్ సహాయంతో దమ్ము చేస్తున్న రైతు

ఖరీఫ్ వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలు సాగుకు అనుకూలించడంతో వ్యవసాయ పనుల్లో రైతులు పూర్తిగా నిమగ్నమయ్యారు. ఇదే సమయంలో వీఆర్‌ఎస్ ప్రాజెక్టు పరిధిలోని కాలువల ద్వారా నీరు విడుదల కావడంతో ముమ్మరంగా పనులు చేపట్టారు. ఓ వైపు దమ్ములు చేస్తూ.. మరోవైపు వరి నాట్లు వేస్తూ ముందుకు సాగుతున్నారు.

– మక్కువ



కె.పెద్దవలస గ్రామం సమీపంలో నారుతీస్తున్న గిరిజన రైతులు



మక్కువ సమీపంలో ఉబాలు జరుపుతున్న మహిళలు



మార్కొండపుట్టి సమీపంలో పొలానికి ఎరువులు వేసేందుకు సిద్ధం చేస్తున్న రైతు

దోమల నివారణకు ప్రత్యేక చర్యలు



నిడగల్లులో ఖాళీ మట్టి కుండీలను తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

సీతానగరం: గ్రామాల్లో దోమల నివారణ ప్రజలు సామాజిక బాధ్యతగా గుర్తించి వైద్య, పంచాయతీ రాజ్ శాఖల అధికారులు, సిబ్బంది చెప్పిన సూచనలు పాటించాలని ఈఓపీఆర్‌డీ కె.కుమార వర్మ అన్నారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా మండలంలోని అన్ని గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు జరిగాయన్నారు. దోమల నివారణకు పారిశుధ్య పనులు చేయడంతో పాటు తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. నిడగల్లులో సర్పంచ్ రాయిపిల్లి ఆరుద్రమ్మ ఆధ్వర్యంలో ఇంటింటికీ సర్వే నిర్వహించామన్నారు. దోమల నివారణ చర్యలు చేపట్టామన్నారు. పంచాయతీ కార్యదర్శి పెంట తిరుపతిరావు, ఇంజినీరింగ్ సహాయకులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న రెండవ అదనపు జిల్లా జడ్జి ఎస్.దామోదర్‌రావు

- రెండవ అదనపు జిల్లా జడ్జి దామోదర్‌రావు

పార్వతీపురం టౌన్: ప్రతి ఒక్కరు ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలని రెండో అదనపు జిల్లా జడ్జి ఎస్.దామోదర్‌రావు అన్నారు. పార్వతీపురం మండలం రావికోన గ్రామంలో మండల లీగల్ సర్వీస్ కమిటీ, రెడ్‌క్రాస్, లయన్స్ క్లబ్, ఐఆర్‌పీడబ్ల్యూఏ, డాక్టర్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో విజయనగరం మిమ్స్ ఆస్పత్రి, జిల్లా వైద్య ఆరోగ్య శాక సౌజన్యంతో మెగా ఉచిత వైద్య శిబిరం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రెండో అదనపు జిల్లా జడ్జి దామోదర్‌రావు మాట్లాడుతూ రావికోన వంటి మారుమూల గిరిజన గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేయడం ఆవశ్యమన్నారు. సీజనల్ వ్యాధులు, మలేరియా, చిన్న పిల్లల వ్యాధులు, మహిళల గర్భకోశ వ్యాధుల తదితర వ్యాధులపై అవగాహన కలిగించడంతో పాటు వైద్య పరీక్షలు చేయడం ముదావహమన్నారు. గిరిజన ప్రాంతంలో ప్రజలు దోమల బారిన పడకుండా దోమ తెరలు అందజేయాలని జిల్లా వైద్య శాఖకు ఆదేశించారు. ఈ సందర్భంగా జీపీ స్కూల్ ఆవరణలో మొక్కలు నాటారు. రావికోన, చందలింగి, కొత్తవలస, అడ్డూరువలస, ఆర్కే బట్టివలస గ్రామాలకు చెందిన సుమారు 250 మందికి శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. రెడ్‌క్రాస్ చైర్మన్ డాక్టర్ ఎం.శ్రీరాములు మహిళలకు హైజినిక్ కిట్లు, ఇళ్లకు అవసరమైన టార్పాలిన్లు పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బీఏబీ రావు ఆధ్వర్యంలో పులిహోర ప్యాకెట్లు అందజేశారు. శిబిరంలో పార్వతీపురం జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి.వాగ్దేవి, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ డా. జగన్‌మోహన్‌రావు, డాక్టర్ల అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ వై.వివేక్, జయప్రకాష్ బాబు, అడ్డూరవలస పీహెచ్‌సీ సిబ్బంది, రావికోన సర్పంచ్ రామస్వామి, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎన్.శ్రీనివాసరావు, మండల్ లీగల్ సర్వీస్ కమిటీ సభ్యులు డాక్టర్ భోగేశ్వరరావ్, డాక్టర్ దుర్గాప్రసాద్, ఎన్జీఓ అసోసియేషన్ ప్రెసిడెంట్ కిషోర్, డాక్టర్ మధుసూదన్, నిమ్స్ పీఆర్ఓ శ్రీనివాసరావు, పార్వతీపురం వైద్యులు, మిమ్స్ వైద్యులు, ఐఆర్‌పీడబ్ల్యూఏ డైరెక్టర్ ప్రకాష్, స్కూలు హెడ్మాస్టర్ రామారావు, కాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పురోగతిపై దృష్టి సారించాలి

- ఎంపీడీఓ రామకృష్ణ



వివిధ శాఖల అధికారులు, సిబ్బందితో సమీక్ష చేపడుతున్న ఎంపీడీఓ రామకృష్ణ

పాలకొండ రూరల్: మండలంలో అభివృద్ధి పనుల పురోగతిపై అన్ని శాఖల అధికారులు దృష్టి సారించాలని ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్, విద్యుత్, విద్యా, ఐసీడీఎస్, వ్యవసాయ, హౌసింగ్ శాఖల అధికారులు, క్షేత్ర స్థాయి సిబ్బందితో సమీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా తాజా స్థితిగతులపై ఆరా తీశారు. ప్రజలకు శాశ్వత ప్రజయోజనాలు చేకూరేలా నాణ్యతతో కూడిన పనులు చేపట్టాలన్నారు. ముఖ్యంగా ప్రస్తుత వ్యవసాయ, వర్షాకాల సీజన్ నేపథ్యంలో రైతులు, ప్రజలకు అందించే సాగు, తాగు నీటి సరఫరాలో లోపాలు అధిగమించాల్నారు. ఇతర శాఖల సమన్వయంతో పనుల్లో జాప్యం లేకుండా చూడాలని ఆదేశించారు.

వీఆర్‌ఏలను నైట్ డ్యూటీ నుంచి మినహాయించాలి



వీఆర్‌ఏల మన్యం జిల్లా అధ్యక్షుడు ఈశ్వరరావు

కురుపాం: వీఆర్‌ఏలను రాత్రి విధుల నుంచి మినహాయించాలని పార్వతీపురం మన్యం జిల్లా వీఆర్‌ఏల సంఘం అధ్యక్షుడు జి.ఈశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక విలేకరులతో ఆయన శుక్రవారం మాట్లాడారు. వీఆర్‌ఏలపై రాష్ట్ర ప్రభుత్వం నిరంకుశంగా మోపిన రాత్రి విధులను నిలుపుదల చేయాలన్నారు. ప్రత్యేక అలవెన్సు ఇవ్వాలని, భద్రత కల్పించాలని కోరారు. మహిళలతో రాత్రి పూట డ్యూటీలు నిలుపుదల చేసి తెలంగాణ మాదిరిగా మన రాష్ట్రంలో కూడా పేస్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. పై సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఈ నెల 3న తహసీల్దార్లకు, 6న ఆర్‌డీఓలకు, 9న కలెక్టర్‌కు, 14, 15 తేదీల్లో మంత్రులు, ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు అందజేయనున్నట్టు తెలిపారు.

అధ్వానంగా భవిత కేంద్రం



అధ్వానంగా ఉన్న కురుపాం మండల కేంద్రంలోని భవిత కేంద్రం

కురుపాం: మండల కేంద్రంలోని భవిత(ప్రత్యేక అవసరాల గల పిల్లల వనరుల కేంద్రం) కేంద్రం అధ్వానంగా ఉంది. ఈ కేంద్రంలోని 10 మంది వరకు ప్రత్యేక అవసరాల పిల్లలు ఉన్నారు. సర్వశిక్ష అభియాన్ నిధులతో కొన్నేళ్ల కిందట భవన నిర్మాణం చేపట్టారు. పర్యవేక్షణ లేకపోవడంతో భవనం అధ్వానంగా మారింది. స్లాబ్‌పై, స్టెడ్స్‌పై పిచ్చి మొక్కలు లేచిపోయాయి. భవనానికి చెందిన తలుపులు అధ్వానంగా తయారయ్యాయి. ఈ పరిస్థితుల్లో ఇక్కడ పిల్లలు పరాయి పంచన ఉంటున్నారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు సిబ్బంది తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనాఅధికారులు స్పందించాలని పిల్లల తల్లిదండ్రులు కోరుతున్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించండి

బొబ్బిలి రూరల్: మండలంలోని అక్కేనవసలస, కృపవలస, రామన్నవలస, సియోనువలస గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని సీపీఐ నాయకులు ఒమ్మి రమణ, కోట అప్పన్న తదితరులు కోరారు. ఇదే విషయమై వారు స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి శుక్రవారం వెళ్లి, గిరిజన గ్రామాల్లో నెలకొన్న పరిస్థితులను వివరించారు. రోడ్లు, తాగునీరు, విద్యుత్ సౌకర్యాలు లేకపోవడంతో అక్కడి గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. స్పందించిన ఎమ్మెల్యే.. అధికారులతో మాట్లాడి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం..

- ఎంఆర్‌పీఎస్ నాయకులు



భామినిలో మాట్లాడుతున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

భామిని: ఎస్సీ వర్గీకరణకు అనువుగా మాదిగలు, ఇతర ఉపకులాల విభజనకు రాష్ట్ర ప్రభుత్వాలకు అనుమతులు ఇస్తూ సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడంపై హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఈ మేరకు బత్తిలి, భామినిలో శుక్రవారం అభినందన సభలు నిర్వహించి, కేక్‌లు కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు. బత్తిలిలో వైఎస్సార్‌సీపీ నాయకుడు, ఎంఆర్‌పీఎస్ నేత టింగ అన్నాజీరావు, సర్పంచ్ టింగ శాంతికుమారిల ఆధ్వర్యంలో.. భామినిలో ఎంఆర్‌పీఎస్ జిల్లా నాయకులు కవిటి రాజు, లోపింటి రాజేష్, బొమ్మాళి సంజీవ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో వారు మాట్లాడుతూ, ఎంఆర్‌పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ, ప్రధాని మోదీ, తీర్పు ఇచ్చిన జడ్జిలకు కృతజ్ఞతలు తెలియజేశారు.

పాలకొండ : ఎస్సీ వర్గీకరణ నిబంధనలకు విరుద్ధంగా ఉందని ఎస్సీ కుల సంఘ నాయకులు ఆరోపించారు. ఈ మేరకు శుక్రవారం పట్టణంలో పలు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. పట్టణ ప్రధాన రహదారిలో ర్యాలీ నిర్వహించి, ఏలాం సెంటర్‌లో మానవహారం చేపట్టారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు నూతలపాటి భరత్ భూషణ్, వై. లిల్లీపుష్పనాథం, బత్తిన మోహనరావు, తదితరులు మాట్లాడుతూ... కులగణన చేపట్టకుండా వర్గీకరణ చేయడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. ఎవరి ప్రయోజనాల కోసం ఈ వర్గీకరణ అని ప్రశ్నించారు. వర్గీకరణకు వ్యతిరేకంగా దళితులంతా ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గణేష్ బాబు, ఉమా, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి పక్కా ప్రణాళికలు



వాటర్ హార్వెస్టింగ్ సిస్టం పనులు పరిశీలిస్తున్న నాగరాజు

మెంటాడ: మండలం, పంచాయతీల అభివృద్ధికి పక్కాగా ప్రణాళికలు వేసి పర్యవేక్షణ చేయాలని ఎస్‌ఆర్‌ఐడీపీ సీనియర్ కన్సల్టెంట్ నాగరాజు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో జీపీడీపీ నిధుల అప్‌లోడ్ చేసే విధానాన్ని కేటగిరీల వారీగా శుక్రవారం పరిశీలించారు. పాఠశాల విద్యార్థులకు పారిశుధ్యం, నీటి వినియోగంపై అవగాహన కల్పించేందుకు కృషి చేయడం వల్ల భవిష్యత్‌లో మంచి ఫలితాలు ఉంటాయన్నారు. అనంతరం ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులను పరిశీలించారు. మెంటాడ గ్రామ పంచాయతీలో పీడబ్ల్యూ వాటర్ స్కీం, రూట్ వాటర్ హార్వెస్టింగ్ సిస్టం నిర్మాణ పనులు పరిశీలించారు. పాఠశాలను సందర్శించారు. ఎంపీడీఓ లక్ష్మీబాయి, ఈఓపీఆర్‌డీ విమల కుమారి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివకుమార్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాహితానికి సమాచార హక్కు చట్టం



సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ జిల్లా సహాయ సంచాలకులు శ్రీనివాస్

సాలూరు: ప్రజాహితానికి సమాచార హక్కు చట్టం ఎంతగానో ఉపయోగపడుతుందని వ్యవసాయ శాఖ జిల్లా సహాయ సంచాలకులు శ్రీనివాస్ అన్నారు. పట్టణంలో వ్యవసాయ సంచాలకుల కార్యాలయంలో ఏడీఏ మధుసూదనరావు అధ్యక్షతన సాలూరు, పాచిపెంట, మక్కువ మండలాల వ్యవసాయ శాఖ అధికారులతో సమాచార హక్కు చట్టం 2005పై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ చట్టం ప్రజాహితం కోరి ఏర్పాటు చేసిందన్నారు. చట్టంలో సెక్షన్‌ల గురించి వివరించారు. పలువురు సందేహాలును నివృత్తి చేశారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారులు, అగ్రిల్యాబ్ వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలు పాటించండి



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎంవీఐ సత్యనారాయణ

బలిజిపేట: వాహనాలు నడిపేటప్పుడు నిబంధనలు పాటించాలని పార్వతీపురం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ అన్నారు. బలిజిపేటలో వాహనదారులకు అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు వేగంతో ప్రయాణించి ప్రమాదాలకు గురి కావద్దని సూచించారు. ఆటోలు నడిపేవారు నిబంధనల ప్రకారం ప్రయాణికులను ఎక్కించాలన్నారు. అతివేగం ప్రమాదకరమన్నారు. లెక్కకు మించి ఆటోలపై ప్రజలను ఎక్కించరాదన్నారు. వాహనాలు నడుపుతూ సెల్‌ఫోన్లు మాట్లాడరాదని తెలిపారు. మైనర్లకు ఇచ్చేవారికి అపరాధ రుసుములు వేయాల్సి వస్తుందన్నారు. సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మ పాలే...బిడ్డకు ఔషధం



సాలూరు: బంగారమ్మ కాలనీలో నిర్వహిస్తున్న తల్లిపాల వారోత్సవ కార్యక్రమం

తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా పలుచోట్ల శుక్రవారం అవగాహన ర్యాలీలు, అవగాహన సదస్సులు నిర్వహించారు. తల్లి పాలతో కలిగే లాభాలపై అవగాహన కల్పించారు. ఆయా కార్యక్రమాల్లో వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



సీతానగరం: తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన అవగాహన ర్యాలీలో మాట్లాడుతున్న డాక్టర్ పావని

గిరిజన సమస్యలను పరిష్కరించండి

- మాజీ ఎమ్మెల్యే కళావతి



పీఓను సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే కళావతి, ఎంపీపీ, తదితరులు

సీతంపేట: గిరిజన ప్రాంతాల్లో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని పాలకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి కోరారు. ఐటీడీఏ పీఓ రాహుల్‌కుమార్ రెడ్డిని శుక్రవారం ఆయన చాంబర్‌లో పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులతో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఏజెన్సీలో రహదారులు, తాగునీరు, తదితర మౌలిక వసతులు కల్పించాలన్నారు. అలాగే గృహనిర్మాణాలు చేపట్టాలన్నారు. అర్హత కలిగిన గిరిజన రైతులకు కొండపోడు పట్టాలు ఇవ్వాలని కోరారు. కొత్త పంచాయతీలకు నూతన భవనాలు మంజూరు చేయాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల్లో ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లకు పార్టీలకతీతంగా సముచిత స్థానం కల్పించాలన్నారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని పీఓ హామీ ఇచ్చారు. అనంతరం పీఓను ఎమ్మెల్యే, తదితరులు సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.ఆదినారాయణ, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎస్.లక్ష్మి, సర్పంచ్‌లు ఎ.కళావతి, సుశీల, తిరుపతిరావు, ఎంపీటీసీ సభ్యులు చంద్రశేఖర్, మంగయ్య. తదితరులు పాల్గొన్నారు.